విశాలాంధ్ర
విజయనగరం
పేజి నెం. 8
శుక్రవారం 3, జనవరి 2025

రెవెన్యూ సదస్సులు రైతుల సద్వినియోగం చేసుకోవాలి : తహాశీల్దార్ ఎం శ్రీను

విశాలాంధ్ర-బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారానికి రెవిన్యూ శాఖ ద్వారా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెవెన్యూ సదస్సులను రైతులు తమ సమస్యలను తెలియజేసి సమస్యలకు పరిష్కారం పొందాలని , రెవిన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహాశీల్దార్ ఎం శ్రీను పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కమ్మ వలస కొండదేవిపల్లిలో తహాశీల్దార్ ఎం శ్రీను అధ్యక్షతన రెవెన్యూ సదస్సులో ఏర్పాటు చేశారు. రెవిన్యూ సదస్సులో పలువు రైతులు భూ సమస్యలను తెలియజేశారు. సమస్యల పరిష్కారానికి సిబ్బంది తో మాట్లాడి సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడతానని రైతులకు తాసిల్దారు తెలిపారు .ఈ కార్యక్రమంలో రీ సర్వే ఉప తహాశీల్దార్ శివుని నాయుడు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుతమ్ముళ్ళలో పెరుగుతున్న అసంతృప్తి జ్వాలలు

మేడంతో మాట్లాడడం కష్టమంటూ ఆవేదన
బంగ్లాకు దూరమైన పలువురు నేతలు
విజయనగరం నియోజకవర్గంలో తమ్ముళ్ళ పరిస్థితి

అశోక్ బంగ్లా

అధితి గజపతిరాజు

విశాలాంధ్ర-విజయనగరం : విజయనగరం నియోజకవర్గం అంటే తెలుగుదేశం పార్టీకి పెట్టని కోటగా చెప్పుకుంటారు. నియోజకవర్గంలో అశోక్ గజపతిరాజు అంటే తెలుగుదేశం అనే విదంగా ఉంది. ఆయన వెంట పార్టీ అంటే ప్రాణాలు ఇచ్చే నేతలు, కార్యకర్తలు ఉంటారు. ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. నేతలు, కార్యకర్తలు అశోక్ మనోగతానికి అనుగుణంగా వ్యవహరించేవారు. అయితే తాజాగా అశోక్ కుమార్తె అధితి విజయలక్ష్మి గజపతిరాజు గత ఎన్నికలలో పోటీ చేసి ఓటమి చెందినా, ఇటీవల జరిగిన ఎన్నికలలో ప్రజలు భారీ మెజారిటీతో గెలుపును ఇచ్చారు. ఎన్నికలకు ముందు అభ్యర్థిగా తమతో ఉన్న అధితికి ఇప్పుడు ఎమ్మెల్యే అధితికి చాలా తేడా వుందని తెలుగుతమ్ముళ్ళు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలతోపాటు, నేతలు సైతం బంగ్లా వైపు వచ్చేందుకు ఆసక్తి చూపడంలేదనేది ఆ పార్టీలో నడుస్తున్న టాక్..

ఎందుకలా జరుగుతోంది..!

సాదారణంగా అధితి గజపతిరాజు గతంకన్నా ఈసారి ప్రజలతో మమేకమయ్యారనే చెబుతున్నారు. కానీ ఎన్నికల అనంతరం ఆమె మారిపోయారనే అనుమానం కలుగుతోందని అనుమానం కార్యకర్తల్లో నెలకొంది. విజయనగరం కార్పోరేషన్‌లోని ఏడివిజన్ నేతలైనా నేరుగా మేడంగారితో మాట్లాడాలంటే అపాయింట్‌మెంట్ కష్టమని అంటు న్నారు. ఆమె ఆదేశాల మేరకు అంతా ఆమె అనుచరునిగా ఉన్న ఓ నేత అంతా చూసుకుంటారని అంటున్నారు. ఆయనే అన్నీ పరిశీలన చేసి, సమస్యలను తెలుసు కుని పరిష్కారాలను చూపుతారని చెప్పుకుంటున్నారు. మేడం తీరు చూసిన పలువురు నేతలు హవ్వ అంటూ ముక్కున వేలుసుకుని బంగ్లాలోకి వచ్చి మనకెందుకులే అని వెళ్ళిపోతున్నారు. పేరున్న నేతలకే ఇంత కష్టంగా మారితే ఇక సామాన్య కార్యకర్తల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలని టీడీపీ వీర అభిమానులు ఆవేదనతో చెబుతున్నారు. ఇదిలా వుండగా ఇప్పటికే ఐక్యమత్యంగా ఉండాల్సిన పలువురు ముఖ్యనేతలు గ్రూపులుగా మారిపోయినట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. ఎమ్మెల్యేగానే కాకుండా నియోజకవర్గం పెద్దదిక్కుగా వున్న అధితి గజపతిరాజు కార్యకర్తల అసంతృప్తి జ్వాలలను చల్లార్చే ప్రయత్నాలు చేయాలని పలువురు బంగ్లా అభిమానులు కోరుతున్నారు. అలాగే పలు విషయాలు, క్షేత్ర స్థాయి సమస్యలు ఆమె దృష్టికి వెళ్ళకుండా కొందరు అడ్డుకుంటున్నారనే వాఖ్యలు కూడా వినిపిస్తున్నాయి. ఈనేపధ్యంలో ఆమె క్షేత్ర స్థాయిలో కార్యకర్తలతో అప్పుడప్పుడు డివిజన్‌ల వారీగా సమావేశం నిర్వహిస్తే బాగుంటుందని పలువురు తెలుగుతమ్ముళ్ళు ఆశ పడుతున్నారు. చూద్దాం.. మేడం ఏవిదంగా స్పందిస్తాం.

పేదల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తున్న సిపిఐ ని ఆదరించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ విజ్ఞప్తి

విశాలాంధ్ర-బొబ్బిలి : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాలు చేస్తు ప్రజలకు అండగా నిలబడుతున్న భారత కమ్యూనిస్టు సిపిఐ పార్టీని ప్రజలు ఆదరించాలని పార్టీలో భారీగా చేరాలని, పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రజా పోరాటాల్లో ప్రత్యక్షంగా పరోక్షంగా పాల్గొవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ప్రజలను కోరారు. గురువారం పట్టణంలో సిపిఐ పార్టీ శతాబ్ది ఉత్సవాలకు సంబంధించిన గోడ పత్రికలు ను వివిధ షాపులకు అంటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు కార్మికులకు, కర్షకులకు , విద్యార్థి ఉద్యోగ రైతు హక్కుల సాధనకే అండగా ఉంటూ అనేక పోరాటాలు చేసి ఎన్నో విజయాలు సాధించిన ఘనత సిపిఐ పార్టీకే దక్కుతుంది అన్నారు. బ్రిటిష్ పాలకుల నిర్బంధాలకు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు చేసినందుకు ఎంతోమంది కమ్యూనిస్టులు ధన. ప్రాణాలను తృణప్రాయంగా పెట్టారని తెలియజేశారు. భవిష్యత్తులో సిపిఐ పార్టీ చేసే ప్రజాపోరాటాలకు ప్రజలు అండగా నిలవాలని కోరారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా కార్మిక ఉద్యోగ రైతు వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు భారత కమ్యూనిస్టు పార్టీ కి చేదోడు వాదోడుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న. మునకాల శ్రీనివాస్. సిపిఐ పట్టణ నాయకులు పొడుగు అశోక్. పాలూరి కృష్ణ. వై శ్రీను. అప్పారావు పాల్గొన్నారు.

తాటిపూడి రిజర్వాయర్‌కు గొర్రిపాటి పేరు పునరుద్దరణ

విశాలాంధ్ర-జామి : రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ కృషితో, తాటిపూడి రిజర్వాయర్‌కు గొర్రిపాటి బుచ్చి అప్పారావు రిజర్వాయర్‌గా పేరును పునరుద్దరిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రిజర్వాయర్‌కు గొర్రిపాటి పేరును పునరుద్దరించాలని ఎస్.కోట ఎంఎల్ఏ కోళ్ల లలితకుమారి కూడా మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీంతో మంత్రి కొండపల్లి ఈ అంశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని చేసిన కృషి ఫలితంగా పేరు పునరుద్దరణ జరిగింది. తాటిపూడి రిజర్వాయర్ నిర్మాణానికి విశేష కృషి చేసిన, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు గొర్రిపాటి బుచ్చిఅప్పారావు పేరును ప్రభుత్వం పునరుద్దరించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గా టీ.ఎం.ఫ్లోరెన్స్

విశాలాంధ్ర-వేపాడ: మండల కేంద్రమైన వేపాడ శివారు బక్కునాయుడుపేటలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ గా టీఎం ఫ్లోరెన్స్ గురువారం బాధ్యతల స్వీకరించారు.గతంలో ఈమె ఇక్కడ పనిచేసి ఇన్చార్జి జిల్లా కో ఆర్డినేటర్ గా వెళ్లిన టీ.ఎం ఫ్లోరెన్స్ సుమారు 5 నెలలు పాటు విజయనగరంలో ఇన్చార్జి డిసిఓగా పనిచేశారు. బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నియమించిన జిల్లా కోఆర్డినేటర్ పదోన్నతిలో భాగంగా విశాఖపట్నంలో డిసి ఓగా పనిచేస్తున్న ఎస్.రూపవతి విజయనగరం జిల్లాకి నియమితులయ్యారు.ఈ మేరకు టీ.ఎం.ఫ్లోరెన్స్ వేపాడ గురుకుల పాఠశాలకి ప్రిన్సిపల్ గా బాధ్యతలు స్వీకరించారు.

సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించండి : కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణ ప్రజలు సకాలంలో మున్సిపల్ కి చెల్లించవలసిన అన్ని రకాలు పన్నులను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం పట్టణ పరిధిలో ఇంటి పన్నులు, కులాయి పన్నులు మరియు ఖాళీ స్థలముల పన్నుల వసూళ్లకు సిబ్బందితో అగురు వీధి మరియు కోరాడ వీధి సచివాలయాల పరిధిలో సచివాలయ సిబ్బంది మరియు పురపాలక సంఘ కార్యాలయ సిబ్బంది తోపాటు పాల్గొని హరిప్రియ టెక్స్ టైల్స్ షాపు నుండి 37వేల రూపాయలు చెక్కు రూపంలో వసూలు చేశారు.

మారిక రోడ్డు నిర్మించాలని గిరిజనులు ఎంపీడీఓ కార్యాలయం ముట్టడి

వంటావార్పుతో కార్యాలయం ఎదుట నిరసన

విశాలాంధ్ర-వేపాడ : మారిక రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ గిరి శిఖర మారిక గ్రామానికి చెందిన గిరిజనలు మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ముట్టడించ దంతోపాటు వంట వార్పుతో కార్యాలయం ఆవరణలో నిరసన చేపట్టారు. సిపిఎం జిల్లా నాయకుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ముట్టడిలో గిరిజనులు మాట్లాడుతూ మారిక రోడ్డు నిర్మించేది ఎప్పుడు 78 ఏళ్ల స్వతంత్ర ఫలాలు గిరిజనులకు అందేదెప్పుడని మారిక గిరిజనులకు డిమాండ్ చేస్తూ ఈ నిరసన కార్యక్రమాన్ని వంటా వార్పుతో చేపట్టారు.గిరి శిఖర గ్రామమైన మారికకు రహదారి నిర్మాణం చేపట్టాలని, గిరిజనులమైన మాకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు,మౌలిక వసతులతో పాటు పథకాలు అందించడంతోపాటు విద్యా వైద్య సౌకర్యాలు అందించేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై స్పందించిన తహశీల్దార్ జే.రాములమ్మ, ఎంపీడీఓ సిహెచ్ సూర్యనారాయణలు, పంచాయతీరాజ్ ప్రత్యేక వింగ్ కొత్తవలస ఏ.ఈ ఐశ్వర్యను పిలిపించి గిరిజనులతో మాట్లాడించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఇంజనీరు ఐశ్వర్య మాట్లాడుతూ మారిక గిరిజనుల రహదారి విషయాన్ని జిల్లా కలెక్టర్తోతో పాటు జిల్లా ఇంజనీరింగ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి రహదారి నిర్మాణాన్ని ప్రారంభించి చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. శుక్రవారం నుండి రోడ్డు పనులు చేపడతామన్నారు.ఈ విషయంపై సంతృప్తి చెందని గిరిజనులు రహదారి పనులు చేపట్టే వరకు ఆందోళన కొనసాగిస్తామని పట్టుబట్టి కూర్చున్నారు.ఈ కార్యక్రమంలో కరకవలస సర్పంచ్ పాతబోయిన పెంటమ్మ, గమ్మెల బాబురావు, గెమ్మెల అప్పలనాయుడు, కిల్లో కృష్ణ,జాలరి వీర్రాజు,బాల సోమేశ్వరరావు, రామకృష్ణ, అప్పారావు, లింగరాజు, మహిళలు పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాలు పంపిణీ



విశాలాంధ్ర-శృంగవరపుకోట టౌన్: నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు సందర్భంగా భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేసారు. బాలలకు అర్థమయ్యే రీతిలో వచనంలో బొమ్మల భగవద్గీత, యువతకు ప్రత్యేకించి యువ గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసారు. ఈ కార్యక్రమాన్ని టెక్నో విలేజ్ వ్యవస్థాపకుడు చదరం గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సెంటర్ ఫర్ యోగా అండ్ మెడిటేషన్ (సిమ్) వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ మాట్లాడుతూ గుణ నిర్మాణానికి, వ్యక్తిత్వ వికాసానికి భగవద్గీత తోడ్పడుతుందన్నారు. శ్లోకాలు చదివే సమయంలో శ్వాస క్రమబద్ధంగా తీసుకోవడం వల్ల ప్రాణాయామం జరిగి ఆరోగ్యం మెరుగుపడు తుందన్నారు. విద్యార్థులు ప్రతీ రోజూ గీతా పారాయణం చేయడం వలన వాక్ శుద్ధి, జ్ఞాపక శక్తి, ఏకాగ్రత పెరుగుతాయని సిమ్ డైరెక్టర్ వై.విజయలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో బి.శాంతిలక్ష్మి, కర్రి లక్ష్మణరావు, హృషీకేశ్, లాస్య శ్రీ పాల్గొన్నారు. భగవద్గీత పుస్తకాల కొరకు సిమ్ సంస్థను సంప్రదించవచ్చు అని తెలిపారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు: ఎమ్మార్వో



విశాలాంధ్ర-రాజాం : భూముల సమస్యలను పరిష్కరించడం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తు న్నామని రాజాం ఎమ్మార్వో కృష్ణంరాజు తెలిపారు. కంచరాం గ్రామంలో రెవెన్యూ సదస్సు గురువారం నిర్వహించారు. మ్యూటేషన్, ఆధార్ లింక్, పట్టాదారు పేర్లు సరిచేసేందుకు రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవెన్యూ అధికారులు, సర్పంచి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శతశాతం సౌర విద్యుత్ ను వినియోగించే ఆదర్శ గ్రామానికి రూ.కోటి నజరానా

51వేల ఎస్.సి., ఎస్.టి. గృహాలకు ఫిబ్రవరి నెలాఖరుకు సౌరవిద్యుత్ కనెక్షన్లు
దరఖాస్తు చేసిన వారికి సత్వరమే సౌరవిద్యుత్ కనెక్షన్ - అపార్టుమెంట్లలో పి.ఎం.సూర్యఘర్ కింద సౌరవిద్యుత్ యూనిట్లు
జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ డా.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పి.ఎం.సూర్యఘర్ పథకం ద్వారా జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంత గృహాల్లో రాయితీపై సౌరవిద్యుత్ యూనిట్ల ఏర్పాటును పెద్దఎత్తున ప్రోత్సహిం చనున్నట్టు కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. ఈ పథకం కింద వచ్చే ఫిబ్రవరిలోగా జిల్లాలోని 51వేల ఎస్.సి., ఎస్.టి. గృహాల్లో సౌరవిద్యుత్ కనెక్షన్లు ఏర్పాటుచేసే దిశగా డి.ఆర్.డి.ఏ., మెప్మా, మునిసిపల్, విద్యుత్ పంపిణీ సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆయా వర్గాలకు చెందిన కుటుంబాల్లో సౌరవిద్యుత్ వినియోగంవల్ల కలిగే ప్రయోజనాలు, వారికి ఆదా అయ్యే విద్యుత్ ఛార్జీల మొత్తం తెలియజేసి యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహించాలన్నారు. జిల్లాస్థాయి పి.ఎం.సూర్యఘర్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ అధ్యక్షతన గురువారం కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. రెండు కిలోవాట్ల సామర్థ్యం గల సౌరవిద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఒక్కో కుటుంబం ఏడాదికి రూ.20,000 విద్యుత్ ఛార్జీల బిల్లును ఆదా చేసుకోవచ్చన్నారు. రెండు కిలోవాట్ల సామర్థ్యం గల యూనిట్ ఏర్పాటుపై పి.ఎం.సూర్యఘర్ పథకం ద్వారా రూ.60 వేల రాయితీ లభిస్తుందన్నారు. ఎస్.సి, ఎస్.టి. లబ్దిదారులకు మండల, పట్టణ సమాఖ్యల ద్వారా అవసరమైన మేరకు రుణాలు మంజూరు చేయాలని మెప్మా, డి.ఆర్.డి.ఏ, మునిసిపల్ అధికారులను ఆదేశించారు. ఇళ్ల పైకప్పుపై స్థలం వున్న వారిని గుర్తించి వారి ఇళ్లలో ముందుగా ఈ యూనిట్ల ఏర్పాటుపై దృష్టి సారిం చాలన్నారు. ఆదర్శ సౌరవిద్యుత్ గ్రామాలుగా జిల్లాలో ఆరు గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందని, ఈ గ్రామాల్లో శతశాతం గృహాలకు సౌరవిద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తున్నట్టు వెల్లడించారు. శతశాతం గృహాలతో అత్యధిక సౌరవిద్యుత్ కనెక్షన్లు గల గ్రామాలుగా ఎంపికైన గ్రామానికి రూ.1 కోటి రూపాయలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా మంజూరు చేస్తుందన్నారు. విజయనగరం రూరల్ పరిధిలో జొన్నవలస, పూసపాటిరేగ పరిధిలో రెల్లివలస, కొత్తవలస పరిధిలో దేశపాత్రునిపాలెం, రాజాం మండలంలో బొద్దాం, గజపతినగరంలో పురిటిపెంట, బొబ్బిలిలో పిరిడి గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా ఎంపిక చేశామని వీటిలో శతశాతం గృహాల సౌర విద్యుద్దీకరణ చేసిన గ్రామాన్ని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఆదర్శ గ్రామాల మధ్య పోటీ ఏర్పడి పెద్ద ఎత్తున గృహాల్లో యూనిట్ల ఏర్పాటు జరగాలన్నారు. పట్టణాల్లో అపార్ట్‌మెంట్లలో పెద్ద ఎత్తున రూఫ్ టాప్ సౌరవిద్యుత్ యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహించాలని మునిసిపల్, విద్యుత్ సంస్థల అధికారులు సంయుక్తంగా అపార్టుమెంట్ ల సంఘాలతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. యీ ఫిబ్రవరి నెలాఖరులోగా జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో యూనిట్ల ఏర్పాటుకు యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించాలని ఆదేశించారు. విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్.ఇ. లక్ష్మణరావు, బొబ్బిలి, రాజాం మునిసిపల్ కమిషనర్ లు, డి.ఆర్.డి.ఏ., మెప్మా అధికారులు పాల్గొన్నారు.

రెండువిడతల్లో చెరుకు బకాయిలు చెల్లింపులు

డిప్యూటీ కేన్ కమీషనర్ సత్యనారాయణ వెల్లడి

విశాలాంధ్ర-జామి: భీమసింగి సహకార చక్కెర కర్మాగారం పరిదిలోని చెరుకు రైతులుకు బకాయిలను రెండువిడతలుగా చెల్లింపులు చేయడం జరుగు తుందని, దీనిపై ఆందోళన చెందవద్దని డిప్యూటీకేన్ కమీషనర్ డివివి సత్యనారా యణ సూచించారు. గురువారం భీమసింగి కర్మాగారంలోని ఎండి చాంబర్‌లో భీమసింగి ఎండి వేమల సన్యాసినాయుడు, సంకిలి ప్యారీ ఇఐడి కర్మాగారం ప్రతినిధులతో పాటు స్థానిక చెరుకు రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఎండితో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ ఈఏడాది చెరుకును సంకిలి కర్మాగారానికి తరలించడం జరుగుతోందన్నారు. ఈఏడాది టన్నుకు రూ.2733లను సంకిలి కర్మాగారం మద్దతు ధరను ఇవ్వడం జరుగుతుందన్నారు. దీంతోపాటు మొక్కతోట వేసిన వారికి ఎకరాకు 25నుంచి 30టన్నుల వరకు దిగుబడి వస్తే టన్నుకు రూ.200 అదనంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్శితోటకు 25 టన్నులు వస్తే అదనంగా రూ.100లతో కలిపి రూ.2833 ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈరెండు విదానాలు కాకుండా సాదారణ పంటకు టన్నుకు రూ.2800లు ఇవ్వడం జరుగుతుందన్నారు. అయితే బకాయిల చెల్లింపుల విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, మొదటి విడతలో టన్నుకు 2725లు రైతులకు చెల్లించడం జరిగిందన్నారు. మిగిలిన మొత్తాన్ని క్రషింగ్ ముగిసిన వెంటనే చెల్లింపులు చేస్తారని తెలిపారు. ఈచెల్లింపులపై ప్రభుత్వం తరుపున తాను, భీమసింగి కర్మాగారంనుంచి ఎండి బాధ్యతగా పర్యవేక్షణ చేస్తామన్నారు. ఈసమావేశంలో రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతులంతా అంగీకారం తెలియజేసారు. తమకు ముందుగా చెల్లింపులపై అవగాహన కల్పించాలని, అలాగే ఇతర కార్యక్రమాలపై తెలియజేయాలని కోరారు. ఈసమావేశంలో సంకిలి కర్మాగార మేనేజర్‌లు కమలాకర్ పట్నాయక్, మురళీ, వ్యవసాయ క్షేత్ర స్థాయి సిబ్బంది వాసు పాల్గొన్నారు.

నేడు అవంతి పాలిటెక్నిక్ లో టెక్ ఉత్సవ్

విశాలాంధ్ర-భోగాపురం: మండలం లో కవులవాడ అవంతి పాలిటెక్నిక్ కళాశాల లో "టెక్ ఉత్సవ్ 2కె25: కనెక్టింగ్ విత్ ఫ్యూచర్" సదస్సు నేడు నిర్వహిస్తున్నారు. అవంతి కళాశాల వ్యవస్థాపక చైర్మన్, మాజీ మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాసరావు ఈ కార్యక్ర మానికి సంబంధించి పోస్టర్ను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సాంకేతిక, సృజనాత్మకత పరిజ్ఞానం ప్రాముఖ్యతన పెంపొం దించడం ఈ టెక్ ఉత్సవ్ ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు అధిరోహించడానికి టెక్ ఉత్సవ్ లాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ సదస్సులో ప్రాజెక్ట్ ఎక్స్ పో, పేపర్ ప్రజెంటేషన్,పోస్టర్ ప్రజెంటేషన్,క్విజ్ కాంపిటేషన్ వంటి పోటిలు ఉంటాయని తెలిపారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ప్రథమ బహుమతి 10,000 రూపాయలు, ద్వితీయ బహుమతి 5వేలు అందజేయబడ తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అవంతి కళాశాల ప్రతినిధి ముత్తంశెట్టి మహేష్, హెచ్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ ఎ. చంద్రశేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ హెచ్. మల్లేశం దొర, అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. గోవిందరావు, పరిపాలన అధికారి జి.అశోక్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె భాస్కర్ రావు, అవంతి పాలిటెక్నిక్ కాలేజ్ వైస్ వైస్ ప్రిన్సిపల్ కే. హేమ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో రైతులకు ఎంతో మేలు

విశాలాంధ్ర-మెరకముడిదాం: మండలంలో కొత్తకర్ర, కొర్లం గ్రామాల్లో గురువారం నాడు రెవిన్యూ ర్యాలీ,గ్రామసభ నిర్వహించరు. రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించునున్నట్లు తహాసిల్దార్ అజు రఫీ జాన్ ,తెలి పారు. మొటేషన్లు, పోతి కేసులు సంబంధించిన రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను, కొన్ని త్వరితగతిన మరి కొన్ని 45 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు.రెవెన్యూ నదస్సు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా తహాసిల్దార్ తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డిటి, మండల సర్వేర్, విలేజ్ సర్వేర్, గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

శోభాయమానంగా పాశుర ఘట్ట ప్రదర్శన

విశాలాంధ్ర-డెంకాడ: అఖి లాండ కోటి బ్రహ్మాండ నాయకుడు ఆదిమద్యాంత రహితుడు కలియుగ ప్రత్యక్ష దైవం దేదీప్యమానంగా విరాజిల్లుతున్న విజయనగరం రింగ్ రోడ్ టౌన్ సెంటర్ లేఅవుట్లో వేంచేసియున్న శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా 18వ పాశురాన్ని పురస్కరించుకొని ప్రధాన అర్చకులు శ్రీమన్నారాయణచార్య స్వామి పర్యవేక్షణలో భగవద్రామానుజులు నిత్యం తిరుప్పావై అనుసంధానము చేస్తూ భిక్షాటన చేసే ఘట్టాన్ని ఆలయ అర్చకులు రఘునాథచార్య స్వామి సోదరీమణులు భవ్యశ్రీ,జ్ఞాన శ్రీ ప్రదర్శించారు ఈ విశేషమైన ఉత్సవాన్ని నిర్వహించి గోదామ్మవారికి విశేష పూజలుచేశారు. ఆలయఅర్చకులు శ్రీమన్నారాయణ ఆచార్యులు, రఘునాధాచార్యులు,శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని ఆలయ కమిటీ శ్రీ శ్రీనివాస సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిందని తెలియజేసారు.

ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించిన లేఖరామ్

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: సంస్కృత కళాశాలలో సంస్కృత విభాగం ఆధ్వర్యంలో ఈనెల 2 నుండి 4వరకువరకు మధుర వచస్వి మాన్యాప్రగడ శేషసాయి సంస్మరణోపన్యాసములు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రాచార్యులు డా.గంటా జనార్దన్ నాయుడు తెలిపారు.అందులోభాగంగా మొదటిరోజు కళాశాలలో శేషశాయి సంస్మరణోపన్యాసములు ప్రాచార్యులు డా.జి.జనార్ధన నాయుడు ప్రారంభించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్రీయ విశ్వవిద్యాలయం, అలహాబాద్ సంస్కృత విభాగ సహాయాచార్యులు డా.డి.లేఖరామ్ పాల్గొని సంస్కృత భాషావగాహన,ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సంస్కృతం, వ్యాకరణం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు . ఈకార్యక్రమంలో సంస్కృత ఉపన్యాసకులు టి.రమణ , ఇతర విభాగ ఉపన్యాసకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే చే శంకుస్థాపన

విశాలాంధ్ర-లక్కవరపుకోట: మండల కేంద్రంలోని దొడ్డి ఆది బాబు కళ్ళ ము నుంచి బీసీ కాలనీ జిల్లా పరిషత్తు హై స్కూల ప్రభుత్వము మంజూరు చేసిన రూ20 లక్షల రూపాయలు నిధులతో జరుగు సిమెంట్ రోడ్డు, వీధి కాలువ లు వంటి అభివృద్ధి పనులకు ఎస్.కోట ఎమ్మెల్యే చేతులు మీదుగా గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రగతి బాటలో వివిధ రకాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుదుతుందని ఇంకా ప్రజలకు ఏ రకమైనటువంటి అవసరాలు ఉన్న వెంటవెంటనే పరిష్కారం చేసే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని అన్నారు. స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి పలు రకాల సమస్యలు తెలియజేయగా త్వరలోనే పరిష్కారం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు కరెడ్ల ఈశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు చొక్కాకుల మల్లు నాయుడు, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో సమస్యలు పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే అధితి

విశాలాంధ్ర -విజయనగరం ఫోర్ట్: పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తాం అని శాసనసభ్యులు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. గురువారం సోనియా నగర్ మరియు సారిపిల్లి లో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలను శాసనసభ్యులు పూసపాటి అధితి విజయలక్ష్మి గజపతిరాజు మరియు జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె అక్కడ ఉన్న సమస్యలను ప్రజల నుండి అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. అదే విధంగా సోనియా నగర్, సారిపిల్లిలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని లబ్ధిదారులు అందరూ ఈ గృహాలలో నివసించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను శాసనసభ్యులు పూసపాటి అతిధి విజయలక్ష్మి గజపతిరాజు సూచించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్వి, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఇమంది సుధీర్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాద్ ల ప్రసాద్, చోడిపల్లి రామరాజు, కూటమి నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

నగరంలో పొగరహిత వంటకాలు చేపట్టాలి

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: నగరంలో పొగరహిత వంటకాలు మాత్రమే చేపట్టాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. హోటళ్ళు, తినుబండారాల దుకా ణాలు, మిఠాయి తయారీ దుకాణదారులు పొగ రహితంగా వంటకాలను మాత్రమే తయారీ చేపట్టాలని చెప్పారు. కాలుష్య నియంత్రణ మండలి సూచనల మేరకు ప్రజారోగ్యాన్ని పరిరక్షించే నిమిత్తం కర్రలు, పొట్టు పొయ్యి ,వంటి పొగలు వెదజల్లే వాటితో వంటకాలను తయారు చేయరాదని చెప్పారు. కచ్చితంగా కమర్షియల్ గ్యాస్ ను మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. సంక్రాంతి వరకు గడువు విధిస్తున్నామని అటు పిమ్మట పొగ వెదజల్లే వంటక కేంద్రాలను గుర్తించి భారీగా అపరాధ రుసుములు విధిస్తామని స్పష్టం చేశారు. పొగ కారణంగా ఇబ్బందులు ఉంటే ప్రజలు తమకు సమాచారం అందించినట్లయితే వెంటనే అటువంటి కేంద్రాల యజమానులపై చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ తమకు సహకరించాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్..



విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి పట్టణ పరిధిలో గల వంగపల్లి పేట గ్రామ శివారులో గురువారం నలుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుండి 32 వేల 990 రూపాయలు పట్టు పడినట్లు చీపురుపల్లి ఎస్సై ఎల్ దామోదర్ రావు విలేకరులకు తెలిపారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు పరిశీలన జరుపుగా వారి వద్ద నుండి నగదుతో పాటు మూడు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్న మన్నారు.

దస్తావేజులు పోయినవి

విజయనగరం జిల్లా, రాజాం మండలం, రాజాం నగర పంచాయతీ, వస్త్రపురి కోలనీ కాపురస్తులు ఎజ్జల జ్యోతి దా/ఆఫ్ బోడెల రాజారావు 34 సం" విన్నపములు. నాకు వస్త్రపురి కాలనీలో 100 గజాల ఖాళీ స్థలము యొక్క రిజిష్ట్రేరీ దస్తావేజులు నెం. **133/2014** తేదిన ఈ దస్తావేజులు జిరాక్స్ తీయించుటకు ద్విచక్ర వాహనంపై జిరాక్స్ దుకాణమునకు వెళ్లి నా యొక్క చేతి సంచిలో చూడగా అవి కనిపించడం లేదు. కావున ఎవరికైనా దొరికితే ఈ కింద నెంబర్ కి ఫోన్ **9490998488** ఫోన్ చేసి తెలియ పరచగలరని కోరుచున్నాను.

నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆర్డినేటర్ గా మోహన్ కుమార్ గంటెడాలి

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్. ఉత్తరాంధ్ర స్వచ్ఛంధ్ద సేవ సంస్థల ఫోరమ్ వ్యవస్థపక అధ్యక్షులు, యూత్ ఫౌండేషన్ ఫర్ సొసైటీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గంటెడా మోహన్ కుమార్ జాతీయ మానవ హక్కుల మండలి సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆర్డినేటర్ గ నియమితులయ్యారు. ఉత్తరాంధ్ర మరియు యావత్ భారతదేశం లో అనేక ఎన్జివో ఫెడరేషన్స్ తో నేరుగా సత్సంబంధాలు ఉన్న మోహన్ కుమార్ నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌లో చాలా చురుకైనా పాత్ర పోషించనున్నారు. కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయంలో మాస్టర్ అఫ్ సోషల్ వర్క్ లో వర్సిటీ టాపర్గా నిలిచి కరోనా సమయంలో చేసిన సేవకు గాను జాతీయ స్థాయిలో ఫర్ ఎవర్ స్టార్ ఇండియా అవార్డు మరియు సమాజంలో విభిన్నమైన మార్పులకి దోహద పడే వ్యక్తులకి స్వర్గీయ ఏపీజే అబ్దుల్ కలాంకి నివాళుగా ఐక్యరాజ్య సమితి తో అనుసంధానం అయిన అంతర్జాతీయ ఎన్జిఓ సమాఖ్య ఏటా ఇచ్చే జాతీయ కర్మవీర్ చక్ర అవార్డు కూడా మోహన్ కీ రావడం విశేషం. ఈ సందర్భంగా జాతీయ మానవ హక్కుల మండలి జాతీయ చైర్మన్ డాక్టర్ పాలక సంపత్ కుమార్ మాట్లాడుతూ సమాజ సేవ పట్ల మోహన్ కుమార్ కి ఎంతో ఆశక్తి ఉన్నదని మోహన్ ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆర్డినేటర్ గా నియమించడం పట్ల చాలా సంతోషంగా ఉన్నదని జాతీయ స్థాయిలో సంస్థకి మోహన్ రానున్న రోజుల్లో మంచి పేరు తెస్తారని ఆశభావం వ్యక్తం చేసారు.

పాఠశాలల సందర్శనల్లో ఎంఈఓలు

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని ఆకుల సీతంపేట, చామలాపల్లి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారులు జి.జగదీశ్వరరావు, పి.బాల భాస్కరరావులు గురువారం సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, తరగతి గదులు,పాఠశాల మరుగుదొడ్లు,కిచెన్ గార్డెన్ మొదలగునవి పరిశీలించిన అనంతరం విద్యార్థులతో తెలుగు,ఇంగ్లీషు చదివించడం, రాయించడం, చతుర్విధప్రక్రయులు చేయించడం,విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.చామలాపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సందర్శన సమయమునకు ఉపాధ్యాయులు విద్యార్థులు బోధనలో నిమగ్నమై ఉండగా పాఠశాల పరిసరాలు మరుగుదొడ్లు డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజన పథకం పరిసర ప్రాంతాలు తరగతిగది నిర్వహణ మొదలగుడివి పరిశీలించారు తరగతి గదిలో టి.ఎల్.ఎమ్ గోడపత్రికలు పాతవాటి స్థానంలో కొత్తవి తయారుచేసి ఆకర్షంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల వర్క్ బుక్స్ చూసి ఇంగ్లీష్ రైటింగ్ ఫోర్ వీల్స్ పై ఏ విధంగా రాయాలో సూచించారు. తెలుగు ఇంగ్లీష్ చదివించడం విద్యార్థుల మంచి చొరవ చూపడం అభినందనీయం తెలుగు డిక్టేషన్ చెప్పి అక్షర దోషములు లేకుండా వ్రాయాలని విద్యార్థులకు తెలియజేశారు. మధ్యాహ్నా బడి భోజన పథకం టెస్టింగ్ రిజిస్టర్ అప్డేట్ చేయవలసిందిగా సూచించారు.

టిడ్కో కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తాం

జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్
ఎంఎల్ఏ అదితితో కలిసి కాలనీల పరిశీలన

విశాలాంధ్ర-విజయనగరం: ఎపి టిడ్కో కాలనీల్లో వీలైనంత త్వరగా అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. విజయనగరం ఎంఎల్ఏ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజుతో కలిసి ఆయన గురువారం టిడ్కో కాలనీలను పరిశీలించారు. ముందుగా సోనియా నగర్ టిడ్కో కాలనీని కలెక్టర్ సందర్శించారు. విద్యుత్ సదుపాయం, రోడ్లు, త్రాగునీటి వసతుల గురించి టిడ్కో, మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ దాదాపు 90 శాతం మౌలిక వసతుల కల్పన పనులు పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. సుమారు 411 ఇళ్లకు విద్యుత్ సదుపాయం కల్పించామన్నారు. లబ్దిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణమే వీధిలైట్లు వేయాలని, ఇళ్లచుట్టూ ప్రహరీగోడ నిర్మించి, ఆర్చ్‌ను నిర్మించాలని ఆదేశించారు. కాలనీలో దొంగతనాల నివారణకు పోలీసు అవుట్‌పోస్టును ఏర్పాటు చేయాలని సూచించారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కలను నాటాలన్నారు. ప్రతీ ఇంటికీ కుళాయి కనక్షన్ వేయాలని, నెలాఖరులోగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెలాఖరుకు లబ్దిదారులతో సమావేశాన్ని నిర్వహించాలని, ఫిబ్రవరి మొదటికల్లా లబ్దిదారులంతా ఇళ్లలో నివాసం ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సారిపల్లి టిడ్కో కాలనీలోని ఇళ్లను కలెక్టర్, ఎంఎల్ఏ పరిశీలించారు. ఇక్కడ 2880 ఇళ్లను నిర్మించారు. లబ్దిదారులతో మాట్లాడి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు సుమారు రూ.19కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, దానిలో ఇప్పటివరకు రూ.11 కోట్లు వరకు ఖర్చు చేసి పనులను పూర్తి చేశామని తెలిపారు. అప్రోచ్ రోడ్డు, సిసి రోడ్డు, రిటైనింగ్ వాల్ నిర్మాణం కొంత పెండింగ్‌లో ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గత ఆరునెలలుగా పనులు ఆపివేసినందుకు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పనులను ప్రారంభించాలని, నెల రోజుల్లో అప్రోచ్ రోడ్డును, సుమారు 1.8 కిలోమీటర్ల మేర పెండింగ్‌లో ఉన్న త్రాగునీటి పైప్‌లైన్‌ను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తక్షణమే వీధిదీపాలను ఏర్పాటు చేయాలని, రేపటినుంచే పారిశుధ్య పనులను నిర్వహించాలని నెల్లిమర్ల మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. లబ్దిదారులతో సమావేశం నిర్వహించి పిఎం సూర్యఘర్ పథకం క్రింద ఇళ్లకు సోలార్ విద్యుత్ కనక్షన్ పెట్టుకొనేవిధంగా చైతన్య పరచాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ అదితి గజపతిరాజు మీడియాతో మాట్లాడుతూ, టిడ్కో కాలనీల్లో వీలైనంత తర్వగా కనీస సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. లబ్దిదారులు నివాసం ఉండేవిధంగా మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు సమీపంలో నిర్మించిన సబ్ స్టేషన్‌ను శుక్రవారమే ప్రారంభిస్తామని చెప్పారు. మౌలిక సదుపాయాలు లేకపోవడంతో లబ్దిదారులు ఇళ్లలోకి రాకుండా వేచి చూస్తున్నారని, సదుపాయాలను కల్పించిన వెంటనే వారందరినీ ఇళ్లలోకి రప్పిస్తామని చెప్పారు. గతంలో టిడిపి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించిందని, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం దీనిని పట్టించుకోలేదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో లబ్దిదారుల జాబితాలను కూడా మార్చేశారని, జాబితాలను తనిఖీ చేసి, వారికి న్యాయం జరిపేందుకు కృషి చేస్తామని చెప్పారు. పేర్లను తొలగించిన లబ్దిదారులు అప్పట్లో తమకు ప్రభుత్వం అందజేసిన మంజూరు పత్రాలను తీసుకొని తమను సంప్రదించాలని అదితి కోరారు. ఈ పర్యటనలో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్ పర్సన్ పాలవలస యశస్వి, ఎపిఈపిడిసిఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, మెప్మా పిడి సత్తిరాజు, టిడ్కో ఇఇ డివి రమణమూర్తి, విజయనగరం, నెల్లిమర్ల తాసిల్దార్లు కూర్మనాధరావు, సుదర్సన్, నెల్లిమర్ల మున్సిపల్ కమిషనర్ అప్పలరాజు, ఇతర అధికారులు, టిడిపి నాయకులు ఐవిపి రాజు, బొద్దుల నర్సింగరావు, అవనాపు విజయ్, కర్రోతు నర్సింగరావు, అనురాధ, బిజెపి నాయకులు ఇమంది సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా యంత్రాంగం, లోక్‌సత్తా కృషి తోనే జీతాలు చెల్లింపు : భీశెట్టి బాబ్జి

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : విజయనగరం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జి.జి.హెచ్) తో పాటు మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న జి.డి.ఏ.(జనరల్ డ్యూటీ అటెండర్)ల జీతాలు చెల్లింపు వెనుక జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్, ఆసుపత్రి సూపరెండెంట్ శంబంగి అప్పలనాయుడు,తో పాటుగా లోక్ సత్తాపార్టీ కృషి తో జీతాలు చెల్లింపులు జరిగాయని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు శుక్రవారం సూపరెండెంట్ అప్పలనాయుడు ని కలసి అభినందించిన అనంతరం భీశెట్టి విలేకరులతో మాట్లాడుతూ గడచిన ప్రభుత్వం నిర్వాకంతో రాష్ట్ర వ్యాప్తంగా 8 వందలమంది జి.డి.ఏ లు 18 నెలలుగా జీతాలు అందక చాలా ఇబ్బందులు పడ్డారని,లోక్ సత్తాపార్టీ ఆధ్వర్యంలో వీరి సమస్యను కూటమి ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ తో పాటుగా ఆప్కోస్ ఎమ్.డి.వాసుదేవరావు దృష్టికి తీసుకువెళ్లి నిరంతరం పర్యవేక్షణ చేశామని,రాష్ట్ర వ్యాప్తంగా జి.డి.ఏ.లు కూడా తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాడనికి చాలా ఇబ్బందులు పడ్డారని,నూతన సంవత్సరం లోఈరోజున 24 మంది గడచి 18 నెలల జీతం సుమారు 50 లక్షల రూపాయలు విజయనగరం జిల్లా జి.డి.ఏ లు అందుకున్నారని భీశెట్టి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కాంద్రేగుల ప్రసాద్,మాతృభూమి సేవాసంఘం ప్రతినిధి ఇప్పలవలస గోపి,జి.జి.హెచ్.కార్యాలయ అధికారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా తలసరి ఆదాయం పెంచడంలో వ్యవసాయమే కీలకం

సాగు విరామం లేకుండా చూడాలి
స్వర్ణాంధ్ర లక్ష్యాలలో భాగంగా ప్రాధమిక రంగంపై సమీక్షించిన కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం: స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ లో భాగంగా ప్రాధమిక రంగం లో జిల్లా తలసరి ఆదాయాన్ని 15 శాతం పెంచడానికి లక్ష్యంగా చేయడం జరిగిందని, ప్రస్తుతం 35 వేలు ఉన్న తలసరి ఆదాయాన్ని 65 వేలకు పెంచాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. అందుకోసం ఒక కార్యాచరణ రూపొందించడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. ప్రాధమిక రంగాలైన వ్యవసాయ, ఉద్యాన, పట్టు, మత్స్య, పశు సంవర్ధక, మైక్రో ఇరిగేషన్ తదితర శాఖలు వారి రంగం లో ఏ విధంగా పురోగతి సాధించవచ్చునో 15 రోజుల్లోగా నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ప్రాధమిక రంగం పై కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఎంత భూమి ఉంది, అందులో ఎంత భూమి వ్యవసాయ యోగ్యంగా ఉంది, ఏ ఏ పంటలకు అనుకూలంగా ఉంది, వర్షాధారం ఎంత , జలవనరుల ద్వారా ఎంత సాగవుతోంది తదితర వివరాలను వర్గీకరించి మండల వారీగా సమర్పించాలని తెలిపారు. ఎట్టి పరిస్థితి లోనూ సాగుకు అవకాశం ఉన్న భూమి సాగు లేకుండా ఖాళీ గా ఉండకూడదని అన్నారు. ఖరీఫ్ అనంతరం మరల ఖరీఫ్ పంట వచ్చే లోపల భూమి పై ఏదో ఒక పంట ఉండాలని స్పష్టం చేసారు. అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు వేయాలన్నారు. వరి లేని చోట ఉద్యాన, ఇతర పంటలకు ఉన్న అవకాశాలను గుర్తించాలన్నారు. రైతుకు ఆదాయం వచ్చే అవకాశాలను చూడా లన్నారు. సాగులో లేని భూమిని ఏ విధంగా సాగులోనికి తీసుకురా వాలనే అంశం పైనే ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 40 వేల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు జరుగుతోందని, దీనిని రెట్టింపు చేసే అవకాశాలు ఉన్నాయని, రైతులు కూడా సిద్ధంగా ఉన్నారని, వారిని ప్రోత్సహించేలా ప్రణాళికలు ఉండాలని ఉద్యాన శాఖ అధి కారులకు సూచించారు. వెయ్యి ఎకరాల్లో పట్టు పరిశ్రమ సాగు జరు గుతున్నదని, పెట్టుబడి ఎక్కువ అయినందున చిన్న కారు రైతులు కాకుండా పెద్ద రైతులను చూడాలని, 3 నెలల్లోనే అధిక లాభాలు వచ్చే పంట కావునా రైతులు ముందుకు వస్తారని ఆ శాఖ అధికారులు ఆ దిశగా కృషి చేయాలనీ తెలిపారు. మత్స్యశాఖ వారి ఉత్పత్తులను పెంచడానికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. పశు సంవర్ధక శాఖ ద్వారా లైవ్ స్టాక్, గుడ్లు ఉత్పత్తి పై దృష్టి పెట్టాలని, మొత్తంగా ప్రాధమిక రంగాన్ని రెట్టింపు చేసే ప్రణాళికలు ఉండాలని తెలిపారు. సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ వరిపంట తో పాటు సమాంతరంగా ఇతర పంటలను అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందన్నారు. చిరు ధాన్యాలు, ప్రకృతి వ్యవసాయం పై దృష్టి పెట్టాలన్నారు. సాయిల్ హెల్త్, , డ్రోన్స్ తదితర సాంకేతిక అంశాలపై కూడ ధ్రుష్టి పెట్టి సమగ్ర ప్రణాళికలను తయారు చేయాలన్నారు. ఈ సమావేశం లో జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి బాలాజీ, వ్యవసాయ అనుబంధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాను నివారించేందుకు ప్రత్యేక నిఘా

విజయనగరం డిఎస్పి ఎం. శ్రీనివాసరావు.

విశాలాంధ్ర-వేపాడ : జిల్లాలో గంజాయి రవాణాను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘాలను ఏర్పాటు చేయడంతో పాటు సైబర్ నేరాలు అదుపునకు చర్యలు తీసుకుంటున్నామని విజయనగరం డిఎస్పి ఎం. శ్రీనివాసరావు,అన్నారు.గురువారం వల్లంపూడి పోలీస్ స్టేషన్ ను పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గంజాయి రవాణా జరుగుతున్నట్లు సమాచారం ఉంటే తెలియజేయాలని విలేకరులను కోరగా కొండ గంగు పూడి రహదారిలో రవాణా జరిగేదని అప్పట్లో పోలీసులు మాటు వేసి కారుతో రవాణా జరిగే గంజాయిను పట్టుకున్నారని తెలిపారు. ముఖ్యంగా మండలంలో ప్రధాన రహదారి సోంపురం వేపాడ రహదారిలో రాత్రి వేళల్లో ఆకతాయిలు ఆరుబయట మద్యం సేవించి బెదిరింపులకు పాల్పడుతున్నారని వీటిని అరికట్టి చర్యలు చేపట్టాలని కోరారు.అలాగే వావిలపాడు వీలుపర్తి రహదారిలో అధిక బరువు గల లోడ్లతో క్రషర్ లారీలు తిరుగుతుండడంతో రాతిపిక్కలు జారి పడడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని వీటి నివారణకు చర్యలు చేపట్టారని కోరారు.దీనిపై స్పందించిన డి.ఎస్.పి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టేషన్ లో సిబ్బంది తక్కువగా ఉందని ఈ విషయం జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార చర్యలు చేపడుతామన్నారు. అలాగే వీలుపర్తి రహదారిలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించాలని ఎస్సై దేవికి సూచించారు.అనంతరం గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో సమావేశమైన డీఎస్పీ గ్రామాల్లో ప్రజలను సైబర్ నేరాలపై అప్రమత్తం చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎస్.కోట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్. అప్పలనాయుడు, వల్లంపూడి ఎస్.ఐ బి.దేవి వల్లంపూడి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నెలవారీ సమావేశం నిర్వహించిన దత్తసాయి వాకర్స్ క్లబ్

విశాలాంధ్ర- విజయనగరం ఫోర్ట్: నూతన సంవత్సరం సందర్భంగా భవి ష్యత్‌లో చేయబోయే సేవాకార్యక్రమాల కార్యాచరణ కై.. కొత్తపేట నీళ్లట్యాంక్ వద్దనున్న మహారాణి అప్పలకొండయాంబ రాక్ గార్డెన్ లో దత్తసాయి వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సి.హెచ్.శేషశైలజ అధ్యక్షతన నెలవారీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన గ్రంధాలయ, పుస్తక ఉద్యమకారులు,వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రస్ట్ బోర్డు మెంబెర్,ప్రముఖ న్యాయవాది ఎన్.ఎస్.ఎస్. ఎస్. వి.ఆర్.ఎం. రాజు మాట్లాడుతూ.. నూతన సంవత్సరంతో కొత్త ఆలోచనలతో, సేవాకార్యక్రమాలు చేసి క్లబ్ ను ముందుకు నడిపించాలని క్లబ్ సభ్యులను ఆశీర్వదించారు. క్లబ్ అధ్యక్షురాలు శేషశైలజ మాట్లాడుతూ జనవరి నెలలో చేయబోయే కార్యక్రమాలకోసం ప్రణాళికను సిద్ధం చేసుకున్నామని,ప్రజల ఆరోగ్యంపై మరింత అవగాహన పెంచటం కోసం మరింత కృషి చేస్తూ క్లబ్ ను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.చివరగా నూతనముగా ప్రమాణస్వీకారం చేసిన దత్తసాయి వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీమతి సి. హెచ్. శేష శైలజ మాట్లాడుతూ క్లబ్ కార్యవర్గ సభ్యుల సహాయసహకారలతో సమాజానికి మావంతు సేవాకార్యక్రమాలు చేస్తూ క్లబ్బును అభివృద్ధిపదంలో నడిపిస్తామని, ఆరోగ్యం పట్ల శ్రద్ధవహిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తామని తెలిపారు. డిస్ట్రిక్ట్ 102 మాజీ గవర్నర్ కె. ఎర్నాయుడు, వనితా వాకర్స్ క్లబ్ వ్యవస్థపాకురాలు సుభద్రాదేవి, దత్తసాయి వాకర్స్ క్లబ్ కార్యదర్శి జి. సంతోషి,కోశాధికారిడి. పైడిరాజు, సభ్యులు %ణ%. జాన్సీ,పి.లక్ష్మి,ఎన్.గౌరీ,ఈ. వెంకటి.ఏధనలక్ష్మి,టి.లక్ష్మి తదితరులు పాల్గున్నారు.

బాలుర పాఠశాల విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

విశాలాంధ్ర-చీపురుపల్లి: వృత్తి విద్య నేర్చుకోవడంతో స్వయం ఉపాధి అవకాశాలు తమ వద్దకే వస్తాయని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే చంద్రశేఖర్ అన్నారు... గురువారం ఉదయం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల యందు జరుగుచున్న తమ పాఠశాలకు చెందిన తొమ్మిది పది విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్ ఆయన సందర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలలో 9,10 తరగతి విద్యార్థులకు వృత్తి విద్య అందజేస్తున్న విషయం తెలిసిందే.అందులో భాగంగా చీపురుపల్లి పట్టణంలో స్థానికంగా ఉన్నా బాలుర పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న 9,10 తరగతుల ఇండస్ట్రియల్ విజిట్ విద్యార్థినీ విద్యార్థులకు గురువారం చీపురుపల్లి పాలిటెక్నికల్ కాలేజ్ లో ఇండస్ట్రియల్ విజిట్ సందర్శించడం జరిగింది.ఒకేషనల్ ట్రైనర్స్ పాఠశాల సిబ్బంది సహకారంతో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె చంద్రశేఖర్ కుమార్ మాట్లాడుతూ వృత్తి విద్య నేర్చుకోవడంతో స్వయం ఉపాధి అవకాశాలు మన ముందుకు వస్తాయని విద్యార్థుల్లో టెక్నికల్ పరిజ్ఞానం పెంపొందించడానికి,సాంఘిక వాతావరణం అలవర్చుకోవడానికి ఉపయోగపడుతుందని,సాంకేతిక విద్యను అతి సులువుగా అర్థం చేసుకోవడానికి ప్రతినెలా గెస్ట్ లెక్చరర్, మూడు మాసాలకు ఒకసారి ఇండస్ట్రియల్ విజిట్ ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రాక్టికల్ వద్దకు వెళ్లి అక్కడ అనుభవజ్ఞుల సూచనలు తెలుసుకోవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో బాలుర పాఠశాల ఎలక్ట్రికల్ హార్డ్వేర్ ఒకేషనల్ టీచర్ జమ్ము వాణి,ఐటి.ఐటిఈస్ జమ్ము అలంకార్,విద్యార్థులు పాల్గొన్నారు.